బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలి

జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

జహీరాబాద్, నవంబర్ 8: జహీరాబాద్ మున్సిపల్‌లో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు చెల్లించాల్సిన పీఎఫ్, ఈఎస్‌ఐ బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సీఐటీయూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికలకు న్యాయపరంగా రావాల్సిన పీఎఫ్, ఈఎస్‌ఐ బిల్లులను వెంటనే చెల్లించాలని, పీఎఫ్ విత్‌డ్రాలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ నెల 11న కలెక్టర్‌కు కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కామయ్య, యశోదమ్మ, మోహన్, చంటి, కాంతమ్మ, నాగమ్మ పాల్గొన్నారు.

పెరిగిన వేతనాలను అమలు చేయాలి

సంగారెడ్డి కలెక్టరేట్, అనవంబర్ 8: పెరిగిన వేతనాన్ని కార్మికులకు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మున్సిపల్ కార్యాలయం దుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు 11వ పీఆర్సీ ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. జీవో నంబర్ 60, 63లలో నిర్ణయించిన విధంగా కేటగిరీల వారీగా వేతనాలను అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సేవలను థర్డ్ పార్టీకు అప్పజెప్పాలనే నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సువర్ణ, సంగమేశ్, సుగుణమ్మ, నర్సింలు, లక్ష్మీనారాయణ, యాదయ్య, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

కూలీల ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్

ఇద్దరు మహిళా కూలీలు మృతి

రాయికోడ్, నవంబర్ 8: మండల పరిధిలోని మల్లంపల్లి గ్రామ శివారులో ఎదురెదురుగా వస్తున్న ట్రాక్టర్ ఆటో ఢీకొనడంతో ఇద్దరు మహిళా కూలీలు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ పరిధిలోని భరత్‌నగర్‌కు చెందిన లాల్‌బీ(19), నర్సమ్మ(50) తోటి కూలీలతో కలిసి మండలంలోని పిప్పడపల్లి గ్రామంలో పత్తి తీసేందుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో నల్లబల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు కూలీలు అక్కడికక్కడే మృతి చెందగా నలుగురికి తీవ్ర గాయాలు కాగా, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్వే వివరాలు పక్కాగా నమోదు చేయాలి

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

బొల్లారం: సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

బొల్లారం నవంబర్ 8: సమగ్ర కుటుంబ సర్వే వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న సర్వే ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. కుటుంబ సభ్యుల వివరాల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. ఎన్యూమరేషన్ బ్లాకుల ప్రకారం ఇండ్లను సందర్శించి కుటుంబ సభ్యుల వివరాలను నిర్ణీత నమూనాలో నమోదు చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ తాత్కాలిక కార్యాలయంలో సర్వేపై అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. కమిషనర్ మంగతాయారు, మేనేజర్ నిర్మలారెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

దూరప్రాంత వాసులను రప్పించాలి

చౌటకూర్, నవంబరు 8: సమగ్ర కుటుంబ కుల గణన సర్వేకు దూర ప్రాంతాల్లో ఉన్న వారిని రప్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా సూచించారు. చౌటకూర్ మండలంలోని కోర్పోలు, సరాఫ్‌పల్లి గ్రామాల్లో శుక్రవారం కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. కోర్పోలులో 920 కుటుంబాలున్నట్లు పంచాయతీ కార్యదర్శి మల్లేశం వివరించారు. మండల ప్రత్యేకాధికారి బాలరాజు, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీకాంత్ ఉన్నారు.

గుమ్మడిదలలో..

గుమ్మడిదల, నవంబర్ 8: గుమ్మడిదల మండల కేంద్రంలో కొనసాగుతున్న సర్వేను మండల ప్రత్యేకాధికారి అఖిలేశ్‌రెడ్డి పరిశీలించారు. ఇండ్లకు అతికిస్తున్న స్టికర్లను, సర్వే తీరును ఎన్యూమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. సర్వేకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ఏవో ప్రభాకర్ ఉన్నారు.

శివనగర్-సికింద్రాబాద్ బస్సు ప్రారంభం

జిన్నారంలో శివనగర్-సికింద్రాబాద్ బస్సుకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

జిన్నారం, నవంబర్ 8: బస్సు సర్వీసులు లేక అవస్థలు పడుతున్న మండలంలోని పలు గ్రామాల ప్రజల ఇబ్బందులను మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్ పరిష్కరించారు. సికింద్రాబాద్ నుంచి వయా జిన్నారం మీదుగా శివనగర్ వరకు జీడిమెట్ల డిపోకు చెందిన బస్సు రోజుకు మూడు ట్రిప్పులు తిరిగేలా సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రారంభమయ్యేలా చేశారు. మండల కేంద్రం జిన్నారంలో జిన్నారం, వావిలాల గ్రామాల నాయకులు, ప్రజలు శుక్రవారం సికింద్రాబాద్-శివనగర్ బస్సుకు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేసి సర్వీసును ప్రారంభించారు. బస్సు సర్వీసులు లేక ఉపాధి, ఉద్యోగాలు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు తీవ్ర అవస్థలు పడిన ప్రజలకు ఈ బస్సు సర్వీసుతో చాలా మేలు జరుగుతుందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. బస్సు సర్వీసును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోరారు.

డీసీఎం ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతి

అందోల్, నవంబర్ 8: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు జోగిపేట ఎస్సై పాండు తెలిపారు. మండల పరిధిలోని నాదులాపూర్ గ్రామానికి చెందిన తలారి కిష్టయ్య(52) శుక్రవారం ఉదయం అల్మాయిపేట్ వద్ద నేషనల్ హైవేపై పనులు చేస్తుండగా వేగంగా వచ్చిన డీసీఎం ఢీ కొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో కిష్టయ్యకు తీవ్ర గాయాలై ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రావెల్ బస్సు ఢీకొట్టిన ఘటనలో మరొకరు

సదాశివపేట, నవంబర్ 8: ట్రావెల్ బస్సు బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన గురువారం అర్ధరాత్రి జాతీయ రహదారి 65 నిజాంపూర్ బైపాస్ రోడ్డుపై చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వెల్టూర్ గ్రామానికి చెందిన మల్లెపల్లి అరవింద్(30), మల్లేశం బైక్‌పై వెల్టూర్‌కు వెళ్తున్నారు. జాతీయ రహదారి 65 నిజాంపూర్ బైపాస్ రోడ్డు వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా హైదరాబాద్ నుంచి జహీరాబాద్ వైపు వెళ్తున్న ఆరెంజ్ ట్రావెల్ బస్సు అతివేగంతో ఢీకొట్టింది. దీంతో అరవింద్ అక్కడికక్కడే మృతిచెందగా మల్లేశానికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన మల్లేశంను అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అరవింద్ తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

లబ్ధిదారుడికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, నవంబర్ 8: అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు దవాఖానల్లో చికిత్స పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసానిస్తుందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన మండలంలోని దిగ్వాల్ చెందిన శ్రీకాంత్‌కు రూ.27 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు విఠల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ఝరాసంగం, నవంబర్ 8: మండల పరిధిలోని ఏడాకులపల్లిలో శుక్రవారం మాజీ ఎంపీటీసీ పెద్దగొల్ల శివకుమార్ మరణించారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్‌తో కలిసి వారి నివాసానికి వెళ్లి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు జగదీశ్వర్, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు నర్సింహ గౌడ్, ప్రభు పటేల్, శంకర్, రవి, శ్రీనివాస్, శివన్న, నవీన్ ఉన్నారు.

దవాఖానలో రోగులకు మెరుగైన సేవలు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు, నవంబర్ 8: ఆసియాలోని అతిపెద్ద పారిశ్రామికవాడగా పేరొందిన పటాన్‌చెరు పట్టణంలోని టంగుటూరి అంజయ్య ప్రభుత్వ ఏరియా దవాఖాన నాణ్యమైన సేవలకు చిరునామాగా నిలుస్తున్నదని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం దవాఖానలో ఏర్పాటు చేసిన అభివృద్ధి కమిటీ సమావేశానికి హాజరై అన్ని విభాగాలను పరిశీలించారు. దవాఖాన ప్రాంగణంతోపాటు చుట్టుపక్కల శానిటేషన్ సరిగా చేయడం లేదని సంబంధిత కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం దవాఖాన సూపరింటెండెంట్, ఆర్ఎంవో, వైద్యులు, సలహా సంఘం కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల కేంద్ర ఆరోగ్య శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో పటాన్చెరు ప్రభుత్వ ఏరియా దవాఖానకు నాణ్యమైన సేవల విభాగంలో జాతీయస్థాయిలో ఏడో స్థానం లభించడం పట్ల దవాఖాన వైద్యులు, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ అధికారి, దవాఖాన సూపరిండెంట్ శ్రీనివాసరెడ్డి, ఆర్ఎంవో ప్రవీణ, కమిటీ సభ్యులు గాయత్రి పాండు, కంకర సీనయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, దవాఖాన వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

సబ్బండవర్గాల సంక్షేమమే ధ్యేయం

సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయమని, రూ.50 లక్షల సొంత నిధులతో సాకి చెరువు కట్టపై సూర్య భగవాన్ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపారు. ఉత్తర భారతీయులు సూర్య భగవానుడిని ఆరాధిస్తూ నిర్వహించే ఛట్ పూజ ఉపవాస దీక్షల ముగింపు సందర్భంగా సాకి చెరువు కట్టపై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై ఆలయ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, గూడెం విక్రంరెడ్డి, పృథ్వీరాజ్, శ్రీధర్‌చారి ఉన్నారు.

చెరుకు క్రషింగ్‌కు ప్రత్యేక పూజలు

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్

రాయికోడ్, నవంబర్ 8: మండల పరిధిలో చెక్కర పరిశ్రమ ఏర్పాటు చేయడం సంతోషకరమని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మాటూర్ శివారులో గోదావరి గంగా చెక్కర పరిశ్రమలో చెరుకు క్రషింగ్ కోసం ఫ్యాక్టరీ యజమాని సచిన్‌గోయల్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. చెక్కర కర్మాగారం ఏర్పాటుతో ఈ ప్రాంత చెరుకు రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పరిశ్రమకు ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈ ఏడాది టాన్ను చెరుకుకు రూ.3,700 మద్దతు ధర ఉందని తెలిపారు. అనంతరం నాగ్వార్ శివారులో కాటన్ మిల్‌లో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. సమావేశంలో జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా.సంజీవరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, ఏఎంసీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, ఆర్డీవో రాంరెడ్డి, సీసీఐ నిర్వాహకుడు వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అందోల్, నవంబర్ 8: జోగిపేటలోని పలు కాలనీలకు నాణ్యమైన విద్యుత్ అందించడానికి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నామని, దీంతో మల్లన్నగుడితోపాటు బృందవన్ కాలనీకి విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11గంటల నుంచి మధ్నాహం 2:30 గంటలకు వరకు విద్యుత్ సరఫరాలో అంతరారం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు. మూడు గంటల నుంచి విద్యుత్ సరఫరా యధావిధిగా కొనసాగుతుందన్నారు.

ఫైనల్స్‌కు ఖమ్మం, ఆదిలాబాద్ జట్లు

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 8: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లాలో జరుగుతున్న అంతర్ జిల్లా అండర్-23 లీగ్ పోటీలలో ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లా జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఈ టోర్నమెంట్‌లో భాగంగా శుక్రవారం కొండాపూర్ మండలం చీమలదారి కోనాపూర్‌లో జరిగిన సెమీఫైనల్స్ మ్యాచ్‌లో ఇరు జిల్లాల జట్లు గెలుపొంది ఫైనల్స్‌కు చేరాయి. మొదటి సెమీ ఫైనల్స్‌లో నిజామాబాద్, ఆదిలాబాద్ జట్లు పోటీ పడ్డాయి. ఈ పోటీలో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఆదిలాబాద్ జట్టు నిర్ధారిత 47.2 ఓవర్లకు గాను 252 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఆదిలాబాద్ బ్యాటింగ్‌లో కెప్టెన్ సాయికృష్ణారెడ్డి 114 పరుగులు చేశారు. తర్వాత బ్యాటింగ్ చేసిన నిజామాబాద్ జట్టు 237 పరుగులకే ఆలౌట్ అయింది. రెండో సెమీ ఫైనల్స్‌లో టాస్ గెలిచి మొదటి బ్యాటింగ్ చేసిన ఖమ్మం జట్టు 35.2 ఓవర్లలో 153 పరుగులు చేసి ఆలౌట్ అయింది. తర్వాత బ్యాటింగ్ చేసిన నల్గొండ జట్టు 22.2 ఓవర్లలో 50 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో ఖమ్మం జట్టు 102 పరుగులతో నల్గొండ జట్టుపై విజయం సాధించింది. ఈ నెల 9న ఫైనల్స్‌లో భాగంగా ఖమ్మం, ఆదిలాబాద్ జట్లు తలపడనున్నాయని క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 8: జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా శుక్రవారం తారా ప్రభుత్వ ఎన్ఎస్ఎస్ విభాగాలు, జీవ సాంకేతిక శాస్త్రం, జీవ శాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను ఆదిలోనే గుర్తించి నివారించాలని సూచించారు. జీవశాస్త్ర అధ్యాపకుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సదయ్యకుమార్, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ సదయ్యకుమార్, డాక్టర్ జగదీశ్వర్, జీవశాస్త్ర, సాంకేతిక శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయాలి

జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గైడ్ టీచర్లు

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 8: జిల్లా పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21, 22, 23 తేదీల్లో జిల్లా స్థాయిలో నిర్వహించనున్న బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శనను విజయవంతం చేయాలని డీఈవో వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా సైన్స్ కేంద్రంలో ఇన్స్పైర్‌కు ఎంపికైన 93 ప్రాజెక్టుల గైడ్ టీచర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఈవో సలహాలు, సూచనలు చేశారు. ఇప్పటివరకు 385 ప్రాజెక్టులు మాత్రమే నమోదయ్యాయని, జిల్లా నుంచి కనీసం 800కు పైగా ప్రాజెక్టులు రావాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి సిధారెడ్డి, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలుగొద్దు

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్

గుమ్మడిదల, నవంబర్ 8: మండల కేంద్రంలో పీఏసీఎస్ కేంద్రం నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయాధికారి పరిశీలించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కోరారు. సన్నవడ్ల నిర్ధారణ ఎలా చేయాలో సిబ్బందికి ప్రయోగాత్మకంగా చూపించారు. ధాన్యం తూనికతోపాటు రైస్ మిల్లులకు ధాన్యం తరలించడంలో అలసత్వం ఉండరాదని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. వీరితోపాటు ఎంఏవో శ్రీనివాసరావు, ఏఈవోలు నిఖిత, ప్రణవి, మౌనిక, రైతులు ఉన్నా రు.

ఉపాధ్యాయులకు ఐడీని కేటాయించాలి

డీటీవో కవితకుమారిని సత్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

జహీరాబాద్, నవంబర్ 8: టీఆర్‌టీ ద్వారా నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులకు ఎంప్లాయిస్ ఐడీని కేటాయించాలని టీఎస్ పీఆర్‌టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు తులసీరామ్‌రాథోడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఏటీవో కార్యాలయానికి వచ్చిన డీటీవో కవిత కుమారిని పీఆర్‌టీయూ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నిమమితులైన ఉపాధ్యాయులకు ఐడీ కేటాయించాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులను జారీ చేశారన్నారు. సంబంధిత శాఖాధికారులు తగు చర్యలు తీసుకుని వెంటనే ఎంప్లాయిస్ ఐడీని కేటాయించాలని కోరారు. పీఆర్‌టీయూ శాఖ ఆధ్వర్యంలో డీటీవో కవితకు మారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఏటీవో శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు చంద్రురాథోడ్, శ్రీశైలం, హుస్సేన్, జాఫర్ అలీ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపిక

సంగారెడ్డి కలెక్టరేట్. నవంబర్ 8: రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు వివిధ కేటగిరీలలో విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-14, అండర్-17 ఖోఖో విభాగంలో అందోల్ మండలం డాకూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన కీర్తన, శ్వేత రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కామారెడ్డి, ఖమ్మంలో జరిగే పోటీల్లో వీరు పాల్గొననున్నట్టు పీడీలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వివిధ ప్రాంతాలకు క్రీడాకారులు బయలుదేరి వెళ్లారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండి కృష్ణ, పీడీలు శ్రీనివాస్‌రెడ్డి, రాజాగౌడ్, సీఆర్పీ యాదయ్య, ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి

జహీరాబాద్, నవంబర్ 8: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులు, సిబ్బందిని జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యాధికారులు, సిబ్బందితో మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ మనోహర్ రెడ్డి, వైద్యాధికారులు అమీత్‌రాజ్, గణపతి రావు, సీహెచ్‌వోలు మొగులయ్య, రవి, సుధార్శన్, మార్త పాల్గొన్నారు.

శ్రీధర్‌రెడ్డికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు

శ్రీధర్‌రెడ్డికి స్వీట్ తినిపిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, నవంబర్ 8: మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శ్రీధర్‌కు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి శ్రీదర్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే చింతా శ్రీధర్‌రెడ్డికి శాలువాతో సన్మానించి కేక్ తినిపించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెద్దగొల్ల అంజనేయులు, కోడూరి రమేశ్, ముద్ద నాగనాథ్, నరసింహారెడ్డి, అశోక్, వైద్యనాథ్, బస్వరాజ్, శేఖర్, రాజేశ్, వేణు, రాచన్న, సందీప్ పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి రమేశ్

పటాన్‌చెరు, నవంబర్ 8: సంక్షేమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి రమేశ్ అన్నారు. శుక్రవారం ఇస్నాపూర్‌లోని బాలికల సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి శుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు.

ఘనంగా కార్తవీర్యార్జున జయంతి

కోలాటం ఆడుతున్న మహిళలు

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 8: శ్రీసోమ వంశ సహస్రార్జున క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం సంగారెడ్డిలో రాజరాజేశ్వర కార్తవీర్యార్జున జయంతిని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్షత్రియ సమాజ్ సభ్యులు పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు కోలాటాలతో సందడి చేశారు. క్షత్రియ సభ్యులు మాట్లాడుతూ కత్రి, పట్కరీ సమాజ్‌లకు శ్రీకార్తవీర్యార్జునుడు మూలపురుషుడని, కార్తవీర్యార్జున జయంతిని ఒక పండుగ వాతావరణంలో నిర్వహించుకొంటామన్నారు. కార్యక్రమంలో సమాజ్ అధ్యక్షుడు కోనేరు చందర్, ప్రధాన కార్యదర్శి చవాన్ సత్యానారాయణ, కార్యవర్గ సభ్యులు, యువ సమాజ్ సభ్యులు, మహిళా మండలి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

జహీరాబాద్, నవంబర్ 8: తాళం వేసిన ఉన్న ఇండ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్టు జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. జహీరాబాద్ మండలంలోని హోతి(బి) గ్రామానికి చెందిన ముస్తాక్‌హుస్సేన్(31), సిరిసిగి మహేశ్(21), గాజుల పవన్‌రెడ్డి(24) ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి డబ్బుల కోసం తాళం వేసిన ఇండ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలను పాల్పడుతున్నారు. ఈ నెల 5న జహీరాబాద్ పట్టణంలోని వెంకటేశ్వర్‌నగర్ కాలనీలో సయ్యద్ మహ్మద్‌అలీ దంపతులు బయటకు వెళ్లడంతో వారి ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని 16 తులాల బంగారం గొలుసులను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ రుపేశ్ ఆదేశాల మేరకు పస్తాపూర్ చౌరస్తాలో పట్టణ సీఐ శివలింగం, ఎస్ఐ కాశీనాథ్, చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ నర్సింలు, పోలీసులు నర్సింలు, జైపాల్‌రెడ్డి వాహనాల తనిఖీ చేపట్టారు. బైక్‌పై వెళ్తున్న వారిని పట్టుకొని విచారించగా తాళం వేసిన ఇండ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలను పాల్పడుతున్నట్టు ఒప్పుకున్నారు. జహీరాబాద్ పట్టణంలోని వెంకటేశ్వర నగర్ కాలనీతోపాటు గోడిగార్‌పల్లిలో కూడా దొంగతనాలకు పాల్పడినట్టు చెప్పారన్నారు. వారి నుంచి 16 తులాల బంగారం, బైక్, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని, అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్టు వివరించారు. చాకచాక్యంగా దొంగతనాలకు పాల్పడిన వ్యక్తులను పట్టుకున్న పోలీసులు అధికారులు, సిబ్బందిని అభినందించారు.

'బేటీ బచావో-బేటీ పడావో'పై అవగాహన

ఝరాసంగం, నవంబర్ 8: 'బేటీ బచావో-బేటీ పడావో' బాలికలకు వరమని, వాళ్ల సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కుప్పానగర్ ఉన్నత పాఠశాలలో మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో 'బేటీ బచావో బేటీ పడావో'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లలిత కుమారి మాట్లాడుతూ.. పిల్లలకు చదువుతోపాటు బాలల హక్కులు, చట్టాలను, బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా, హె.ల్ప్ లైన్ నంబర్లు 181, 1098ల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకార్, సీడీపీవో అంజమ్మ, ఏపీవో రాజ్‌కుమార్, మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, సూపర్వైజర్లు, పాఠశాల యాజమాన్యం, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

APGVB ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్
రీజినల్ కార్యాలయం, సంగారెడ్డి

అద్దె / లీజు కొరకు బ్రాంచ్ ప్రాంగణం కావలెను

శాఖ పేరు	సంప్రదించవలసిన నెంబరు
జహీరాబాద్ - 8126	9440903961

పైన తెలుపబడిన ఏరియా, 1800 నుండి 2200 చ॥అ॥ల కనీసం విస్తీర్ణం, గ్రౌండ్ ఫ్లోర్ ప్రాధాన్యం, పార్కింగ్ సౌకర్యం గల ఆవరణ లీజుకు కావలెను. నిర్మాణంలో ఉన్నవి కూడా పరిశీలించబడును. ఆసక్తి గల పార్టీలు సంబంధిత అన్ని డాక్యుమెంట్స్‌లతో ప్రాంతీయ కార్యాలయం / బ్రాంచ్‌ను తేది. 20.11.2024 న లేదా అంతకుముందుగా గాని సంప్రదించగలరు.

సం/- రీజినల్ మేనేజర్, సంగారెడ్డి
ఫోన్ నెం. 9490153762